ఉద్యమ నాయకుడికి ఘన నివాళి

పార్థివదేహంపై పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

వీరభద్రప్ప(ఫైల్)

అయిజ రూరల్, సెప్టెంబర్ 22: మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు వీరభద్రప్ప (50)అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామానికి చేరుకొని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి పలుమార్లు అరెస్టు అయ్యాడని గుర్తు చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లున్నారు. సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, నాయకులు రంగారెడ్డి, పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మీకాంతారావు, సంకాపురం రాముడు, ఆంజనేయులు, వెంకటేశ్, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మాజీ ఎమ్మెల్యే బీరం..



ఫీల్డ్ అసిస్టెంట్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

వీపన గుడ్ల, సెప్టెంబర్ 22: మండల కేంద్రానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బాలకృష్ణ నివాసానికి చేరుకొని పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా మండలంలోని సంగినేనిపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి గుండె ఆపరేషన్ చేయించుకోగా.. ఆయన ఇంటికెళ్లి పరామర్శించాడు. అనంతరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన తాసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బొల్లారం–కొర్లకుంట మధ్యలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి .. మండల ప్రజలకు శాశ్వత సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. తెగిపోయిన కాల్వల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు కమలేశ్వర్‌రావు, భాస్కర్‌రెడ్డి, మల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ఎండీ సర్దార్, బాలస్వామి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సంస్మరణ సభ

సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 22: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో సీపీఎం నాయకుడు జబ్బార్ అధ్యక్షతన నిర్వహించారు. సంస్మరణ సభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై సీతారాం చిత్రపటానికి వేర్వేరుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ ఎమ్మెల్యే సీతారామయ్య, ఆంజనేయులు, యాదయ్య, కృష్ణ, వెంకటేశ్, వేణు, రాజు, భాస్కర్, ఇర్ఫాన్, వినయ్ తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఆర్టీయూ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబర్ 22: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానికంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా పూజారి రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా బాదం రవిప్రకాశ్, కార్యదర్శిగా బాలరాజుగౌడ్, మహిళా కార్యదర్శిగా సంతోష ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధరెడ్డి, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

పడ పోయిన సమస్యలు

• పల్లెల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు • ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు

పారిశుధ్య పనులు చేపట్టక కిష్టంపల్లి రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం

అమరచింత, సెప్టెంబర్ 22: పల్లెల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసిపోయి ఆరునెలలు దాటినా పంచాయతీలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడ పడకేశాయి. గ్రామాల్లో స్థానికంగా ప్రజాప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ ఉంటే ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేసుకుంటారు. ఎన్నికల నిర్వహణ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులు ఉండగానే, పర్యవేక్షణ కోసం నాలుగు గ్రామాలకు ఒకరు చొప్పున ప్రభుత్వం మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. వారు ఒకటి రెండుసార్లు గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించడంతోపాటు పరిష్కరించాల్సి ఉండగా.. ప్రత్యేక అదికారులు రెండు, మూడునెలలు దాటినా కనీసం పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పల్లెలు సమస్యలు పడకేసి పోయాయి. మండలంలో మొత్తం 14 పంచాయతీలు ఉండగా.. ఎంపీడీవో శ్రీనివాసులు నందిమల్ల, ఈర్లదిన్నె, చంద్రఘడ్, మిట్టనందిమల్లకు ప్రత్యేకాధికారి కాగా, ఎంపీవో నర్సింహయ్య చింతరెడ్డిపల్లి, సింగంపేట, నాగల్‌కడ్మూర్, ధర్మాపుర్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. వీరు వారంలో ఒకటిరెండు సార్లు గ్రామాలను సందర్శిస్తుండగా.., కిష్టంపల్లి, మస్తీపూర్, నందిమల్ల ఎక్స్‌రోడ్డుకు తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, కొంకనోనిపల్లి, పాంరెడ్డిపల్లి, చంద్రనాయక్‌తండకు ప్రత్యేకాధికారులుగా డిప్యూటీ తాసీల్దార్ రెడ్యానాయిక్ మాత్రం రెండు నెలల దాటినా ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడక పోవడంతో వీధిదీపాలు వెలగకపోవడం, డ్రైనేజీలు నిండిపోయి, పారిశుధ్య పనులు చేపట్టక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి ప్రజాసమస్యలను పరిష్కరించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కిష్టంపల్లిలో మురుగునీటితో నిండిపోయిన డ్రైనేజీ

అంధకారంలో కిష్టంపల్లి

ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

• ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
• ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 22: ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువరానివని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిఅన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ పంక్షన్ హాల్‌లో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్నామనే భావన ఏమాత్రం లేకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తు సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో సన్మానిస్తున్నపలుసు శంకర్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. పట్టణంలో రేడియంట్ పాఠశాల డైరెక్టర్ దేశ్ రాములు సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అదేవిధంగా జెడ్పీ మాజీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అధునాతన సాంకేతిక విజ్ఞానంపై చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో ఆసక్తి కలిగించాలని.. తద్వారా చక్కటి భవిష్యత్‌కు బాటలు వేసిన వారవుతారన్నారు. అనంతరం జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 100మంది ఉపాధ్యాయులను నిర్వాహకులు శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ, డీసీసీబీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, గణేశ్‌కుమార్, శుభలక్ష్మి, చంద్రశేఖర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్తార్, నారాయణ, నాగరాజు, వెంకటేశ్ ఉన్నారు.

ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

రైతులు ఆర్గానిక్ పంటలను పండించాలి

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 22: రైతులు ఆర్గానిక్ పంటలను పండించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పేర్కొన్నారు. వర్మీకంపోస్టు ఎరువుల ద్వారా పంటలను ఉత్పత్తి చేయాలన్నారు. గద్వాల బ్రహ్మకుమారి సమస్త అధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్గానిక్ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అధిక పురుగు మందులు, ఎరువులు వాడడంతో అనేక రోగాలు, జబ్బులు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, రైతులు అప్రమత్తమై వర్మీకంపోస్టు ఎరువులతో పంటలు పండించాలన్నారు. వర్మీకంపోస్టు వాడకంతో నేలలు సారవంతమవుతాయన్నారు. రైతులు పాతపద్ధతిలో వ్యవసాయం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. పశువులను పెంచి పోషించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో అయ్యప్పరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, కృష్ణకాంత్, మాజీ జెడ్పీటీసీ అరుణారెడ్డి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనంలో ప్రతిభ

చిన్నజీయర్ నుంచి చెక్కు అందుకుంటున్న విద్యార్థిని

వడ్డేపల్లి, సెప్టెంబర్ 22: త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రజావికాస్ ప్రైవేట్ స్కూల్స్ ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో శాంతినగర్‌లోని సరస్వతీ పాఠశాల విద్యార్థిని గంగా నిషిత ప్రథమ స్థానంలో నిలిచింది. చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా రూ.10వేల చెక్కు, ప్రశాంసాపత్రాన్ని అందుకుందని ప్రిన్సిపాల్ రవి, మమత తెలిపారు. కార్యక్రమంలో గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో ప్రతిభా అవార్డు

అవార్డు అందుకున్న అమూల్య

ఖిల్లా ఘణపురం, సెప్టెంబర్ 22: హైదరాబాద్‌లోని విజయమాధవి సంస్కృతి అడాకమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భరతనాట్యం పోటీల్లో మండలంలోని సోలీపూర్‌కు చెందిన నందకిశోర్, రాధిక దంపతుల కుమార్తె అమూల్య పాల్గొని ప్రతిభ కనబర్చింది. మౌంట్ బాసిల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అమూల్య చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. పాఠశాల యాజమాన్యం విద్యార్థినికి భరతనాట్యంలో ప్రత్యేక శిక్షణ అందించింది. హైదరాబాద్‌లో జరిగిన భరతనాట్యం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ కనబరచడంతోపాటు నిర్వాహకులు, చూపరులను ఆకట్టుకొని మన్ననలు పొందింది. అనంతరం విద్యార్థినిని నిర్వాహకులు శాలువాతో సన్మానించి, షీల్డ్‌ను బహూకరించారు.

పని సర్దుబాటు జీవోను సవరించాలి

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 22: ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జీవోను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యకర్తలు, ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తరగతిలో ఉపాధ్యాయుడిని కేటాయించి మెరుగైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఇటువంటి అసంబద్ధ ఉత్తర్వులు జారీ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఉత్తర్వులను తక్షణమే సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీ పొంది రిలీవ్ కానీ ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులకు జూలై, ఆగస్టు వేతనాలు, పెండింగ్ డీఏలు, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఊపిరిగా ఎస్టీయూ 77ఏండ్లుగా పోరాటం చేస్తున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తుపండు రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు, జిల్లా సభ్యులు యూనిస్ పాషా, లక్ష్మణ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండను మండలం చేయాలి

అయిజ, సెప్టెంబర్ 22: మండలంలోని మేడి కొండను మండల కేంద్రం చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని ఆదివారం జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు మేడి కొండ ఈశ్వర్ తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌టీఎస్ఎఫ్ నాయకులు పాల్వాయి లక్ష్మీనారాయణ, టీటీయూ నాయకులు బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో స్కూటీ చోరీ

ఆత్మకూరు, సెప్టెంబర్ 22: పట్టణంలోని మేయిన్‌రోడ్డుకు సమీపంలోని కన్యకాపర మేశ్వరి ఆలయం పక్కనున్న కల్వరాజు కాంప్లెక్స్ ఎదుట నిలిపిన స్కూటీ అపహరణకు గురైనట్లు పోలీసులు తెలిపారు. దిల్లికర్ రాజుకు చెందిన టీఎస్ 37 సీ 6457 నెంబర్‌గల యాక్టివా 5జి 110 వాహనం శనివారం అర్ధరాత్రి చోరీకి గురయ్యింది. ఎప్పటిలాగే ఇంటి ఎదుట ఆపిన వాహనాన్ని దుండగులు అపహరించారు. బాధితుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా ఆత్మకూరులో వరుస దొంగతనాలు పట్టణవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పాన్‌గల్, సెప్టెంబర్ 22: మండలంలోని కేతేపల్లికి చెందిన అనారోగ్య బాధితులైన గడ్డల నర్సయ్య, శ్వేత, ఎల్లమ్మకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు విష్ణు, వెంకటయ్య పంపిణీ చేశారు. ఎల్లమ్మకు రూ.21వేలు, శ్వేతకు రూ.13వేలు, నర్సయ్యకు రూ.30వేలు మంజూరైనట్లు తెలిపారు. సీఎం సహాయనిధి పేదలకు వరమని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, శివ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో చెక్కులు అందజేస్తున్న నాయకులు

'హిందువుల మనోభావాలను దెబ్బతీసిన లడ్డూ కల్తీ వ్యవహారం'

అయిజ, సెప్టెంబర్ 22: తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ కల్తీ జరిగిందనే ప్రచారం యావత్ హిందువుల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి ఆచారి పేర్కొన్నారు. యావత్ ఆలయాల పాలకవర్గాలు, అధికారులను భక్తి భావంతో మెలిగే వారికే ఆలయాల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్నారు. హిందువుల మనోభావాలు, భక్తిభావంతో మెలగాని వారికి పాలకవర్గాలను అప్పగించడం తోనే ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతోపాటు భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు కుయుక్తులు పడుతారన్నారు. భక్తి తోపవిత్రత ఉండదన్నారు. దేశంలోని పవిత్ర మైన ఆలయాలను వ్యాపారులు, భక్తి భావంలేని రాజకీయ నాయకులకు అప్పగించడం తోనే హిందువుల మనోభావాలు మంటకలిసేలా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. హిందూ ఆలయాల నిర్వహణ బాధ్యతలను హిందువులకు అప్పగిస్తేనే పవిత్రంగా ఉంటాయన్నారు. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువత మృతిపై విచారణ చేపట్టాలి

కేటీదొడ్డి, సెప్టెంబర్ 22: మండలంలోని ఉమిత్యాలకు చెందిన కర్రెప్ప, లక్ష్మమ్మ దంపతులకు కూతురు ఇందిర ఆత్మహత్యకు లైగింక వేధింపులే కారణమని తెలుస్తుందని.. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఉమిత్యాలకు వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆత్మహత్యకు కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మాయి మృతికి ముగ్గురు యువకులని తెలుస్తుందని.. వారిని వెంటనే అరెస్టు చేసి న్యాయం జరిపించాలని డిమాండ్ చేశారు. ఇందిరను ఎంతో ఇబ్బంది పెట్టారని ఇందిర చెల్లెలు చెబుతోందని పోలీసులు వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు.

ఇందిర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రంజిత్

అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికే..

అమరచింత, సెప్టెంబర్ 22: అసంఘటిత రంగంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలను చేపట్టేందుకు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూను) ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐలో) విలీనం చేసినట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు వెంకటేశ్, అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసంఘటిత రంగ కార్మికుల జిల్లా స్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. దేశంలో అధికారం వెలగబెడుతున్న బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ తదితర పార్టీలకు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ కార్మికుల సమస్యలపై పోరాటం చేసిన చరిత్ర లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా తీసుకొచ్చిన నాలుగు చట్టాలపై అనుబంధ కార్మిక సంఘాల నాయకులు నోరెత్తి మాట్లాడలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే అసంఘటిత రంగ కార్మికులను ఏకతాటిపై నిలిపి బలమైన ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. అందుకే దేశంలో బలమైన కార్మిక సంఘంగా ఉన్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూను జాతీయ నాయకులు పలుమార్లు చర్చలు జరిపి విలీనం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు హన్మంతు, రాజు, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు వెంకటేశ్

గద్వాల టౌన్ ఎస్సై బాధ్యతల స్వీకరణ

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 22: గద్వాల టౌన్ ఎస్సైగా కల్యాణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యాడు. నూతన ఎస్సై కల్యాణ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతాలపై నిత్యం నిఘా నిర్వహించి అరికట్టేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రం ప్రజలు ఏ సమయంలోనైనా తనను సంప్రదించి సమస్యను తెలిపితే తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి సెప్టెంబర్ 22: విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలైన ఘటన మారు మఖగాల–1లో చోటుచేసుకున్నది. స్థానికులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుఘాతానికి గురయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు చంద్రయ్యను దవాఖానకు తరలించగా డాక్టర్లు పరీక్షించి విద్యుదాఘాతంతో చేయి పూర్తిగా కాలిపోవడం తోపాటు బ్రెయిన్‌లో నరాలు దెబ్బతిని కండ్లు కనిపించడం లేదని నిర్ధారించారు. విద్యుదాఘాతానికి గురైన చంద్రయ్యకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గద్వాలలో పాల్గొన్న 1979–80 సంవత్సరం పూర్వవిద్యార్థులు

గట్టులో విక్టరీ సంకేతాన్ని చూపుతున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 22: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాక్టిషింగ్ హైస్కూల్‌లో 1979–80 సంవత్సరం చదివిన పదోతరగతి విద్యార్థులు బీరెల్లి చౌరస్తాలోని ఎస్వీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా పూర్వ విద్యార్థులకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, నాగేశ్వర్‌రావు, నర్సోజి, కృష్ణయ్య తదితరులకు పూలమాల వేసి సన్మానించారు. అనంతరం 44ఏండ్ల తర్వాత అందరూ ఒకే వేదికలో కలుసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

గట్టు మండలంలో..

గట్టు, సెప్టెంబర్ 22: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో 2004–05 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు పలకరించుకుని యోగక్షేమాల తోపాటు జీవితంలో తాము ఎదుర్కొన్న కష్టసుఖాలను పంచుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను సన్మానించి సహపంక్తి భోజనాలు చేశారు. ఇదిలా ఉండగా పూర్వవిద్యార్థులు రూ.21వేల విలువైన మైక్‌సెట్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, భాస్కర్, కృష్ణయ్య, నర్సింహులు, నగేశ్‌బాబు, జాఫర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.